E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 02-06-2025 (వారం) సోమవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com




దేశంలో 3,758కి చేరిన కొవిడ్ యాక్టివ్ కేసులు..

» 2లో

## పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే

# యువ వికాసం



- పథకంపై కేబినెట్‌లో చర్చించాక నిర్ణయం
- ఈ నెల 5న సమావేశం కానున్న రాష్ట్ర మంత్రివర్గం
- రాజీవ్ యువ వికాసంతో పాటు వివిధ పథకాలపై చర్చించే అవకాశం
- నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయం
- మంత్రులతో సీఎం రేవంత్‌రెడ్డి సుదీర్ఘ భేటీ

ఈ కబురు, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం మంజూరు పత్రాల జారీ వాయిదా పడింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తొలి రెండు కేటగిరీల వారికి యూనిట్లకు సంబంధించిన మంజూరు పత్రాలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే అర్హులందరికీ మంజూరు పత్రాలు ఇచ్చేందుకు కొంత సమయం పడుతుంది కాబట్టి ఈ అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించాలని నిర్ణయించారు.

ఈ నెల 5న రాష్ట్ర కేబినెట్ భేటీ కానుంది. ఇందులో రాజీవ్ యువ వికాసంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, ఇతర కీలక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. ఆదివారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ)లో రాష్ట్ర మంత్రులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. దాదాపు రెండున్నర గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, వానాకాలం పంటల సాగు సన్నద్ధత, ఉద్యోగుల సమస్యలు, క్షేత్రస్థాయిలో పరిస్థితులు, జిల్లాల్లో మంత్రులు చేసిన పరిశీలన, రాష్ట్ర అవతరణ దినోత్సవం నిర్వహణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

యువ వికాసానికి అనూహ్య స్పందన

రాజీవ్ యువ వికాసం పథకానికి ఊహించిన దానికంటే ఎక్కువ స్పందన వచ్చింది. ఈ నేపథ్యంలో..మొత్తం నాలుగు కేటగిరీలకు సంబంధించి ప్రభుత్వానికి అందిన ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో పరిశీలించిన తర్వాతే అర్హుల ఎంపిక జరపాలని, ఈ పథకం కింద అనర్హులకు ఎట్టి పరిస్థితుల్లో చోటు దక్కకుండా, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చూడాలని మంత్రులు సూచించారు. క్షేత్రస్థాయిలో కూడా ఈ పథకం కింద వచ్చిన దరఖాస్తుల విషయంలో ఫిర్యాదులు వస్తున్నాయని, కాబట్టి అత్యంత పారదర్శకంగా పరిశీలన జరపాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ నేపథ్యంలోనే దరఖాస్తుల పరిశీలన పూర్తయ్యాకే అర్హుల జాబితాలను ప్రకటించాలని నిర్ణయించారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని, ఇందుకు జిల్లాల్లో ఏర్పాట్లు పక్కాగా ఉండేలా చూడాలని మంత్రులకు సీఎం సూచించారు.

తరువాయి 2లో

## మావోయిస్టుల మరో కంచుకోటపై గురి




**ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్ మృతిచెందిన అనంతరం కేంద్ర బలగాలు మరో కీలక ప్రాంతాన్ని లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కర్రెగుట్టలను జల్లెడ పట్టడంతోపాటు అబూజ్‌మడ్‌లోకి చొచ్చుకెళ్లిన బలగాలు.. ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దుల్లోని మరో కీలక అభయారణ్యం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది.**

ఈ కబురు, హైదరాబాద్: ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు ఎలియాస్ బస్వరాజ్ మృతిచెందిన అనంతరం కేంద్ర బలగాలు మరో కీలక ప్రాంతాన్ని లక్ష్యంగా ఎంచుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కర్రెగుట్టలను జల్లెడ పట్టడంతోపాటు అబూజ్‌మడ్‌లోకి చొచ్చుకెళ్లిన బలగాలు.. ఛత్తీస్‌గఢ్‌మహారాష్ట్ర సరిహద్దుల్లోని మరో కీలక అభయారణ్యం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ రెండు రాష్ట్రాలను విడదీసే ఇంద్రావతి నదిని ఆనుకొని ఉన్న నేషనల్ పార్క్ అడవులను జల్లెడ పట్టడంపై దృష్టి సారించారంటూ వస్తున్న వార్తలు మావోయిస్టుల్లో కలకలం రేపుతున్నాయి. మావోయిస్టులకు మరో రహస్యస్థావరంగా ఉన్న నేషనల్ పార్క్ అభయారణ్యంలో పార్టీ అగ్రనేతలు తలదాచుకుని ఉన్నారన్న అంచనాతో కేంద్ర సాయుధ బలగాలు సమాయత్తమైనట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సుమారు 2,800 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉన్న నేషనల్ పార్క్ అడవులను మావోయిస్టులు కంచుకోటగా ఎంచుకున్నారు. అక్కడి బీజాపూర్ జిల్లా నుంచి ఇంద్రావతి నది మీదుగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉండటంతో మావోయిస్టులు నేషనల్ పార్క్ అడవుల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలను సాగించారు. కర్రెగుట్టలను జల్లెడ పట్టిన సమయంలో తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు కమిటీతోపాటు ఆ పార్టీ కీలక నేత హిడ్మా ప్రాతినిధ్యం వహించే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ దళాల ఆచూకీ లభిస్తుందని కేంద్ర బలగాలు అంచనా వేశాయి.

తరువాయి 2లో

## నేడు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



తెలంగాణ ఆవిర్భావ వేడుకలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. పోలీసుల కవాతు అనంతరం సీఎం ప్రసంగిస్తారు.

తరువాయి 2లో

## సీఎం రేవంత్‌ను కలిసిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ..



ఈ కబురు: పద్మశ్రీ పురస్కార గ్రహీత, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇవాళ ఉదయం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ని ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు.

» 2లో

## ఈశాన్యంలో భారీ వర్షాలు.. 'డేంజర్' లెవల్‌లో బ్రహ్మపుత్ర!



**అస్సాంలో పలుచోట్ల బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.**

ఈ కబురు,ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అస్సాం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలోని అనేక జిల్లాల్లో వరదల ప్రభావం అధికంగా ఉంది. పలుచోట్ల బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు మణిపూర్ గవర్నర్‌తో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అస్సాంలోని 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు 78వేల మంది తీవ్రంగా ప్రభావితమైనట్లు అంచనా. రోడ్డు, రైలు, ఫెర్రీ సర్వీసులకు అంతరాయం కలుగుతోంది. డిబ్రూగఢ్ జిల్లాలో బ్రహ్మపుత్ర ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. గువాహటిలో ఆదివారం కూడా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వర్షాల కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు ఎనిమిది మంది చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు.

తరువాయి 3లో

## రాష్ట్రంలో ఓ కుటుంబ డ్రామా నడుస్తోంది

- సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- దండుకున్న సొమ్ము పంపకాల్లో గొడవలే ఇందుకు కారణం
- ఆ డ్రామాలో మనం పాత్రధారులం కావాల్సిన అవసరం లేదు
- బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయి
- రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పుడు ఓ కుటుంబ డ్రామా నడుస్తోందని, అధికారంలో ఉన్నప్పుడు దండుకున్న సొమ్మును పంచుకోవడంలో తలెత్తిన గొడవలే ఇందుకు కారణమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలు చేసి దోచుకున్న ఆస్తుల కోసం జరుగుతున్న గొడవల్లో మనం పాత్రధారులం కావాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతి, అక్రమాలపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కేంద్రంలో మూడుసార్లు అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం, ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మచ్చలేని పాలన సాగిస్తోందన్నారు.



తరువాయి 2లో



## నేటి నుంచి అన్నిచోట్ల రిజిస్ట్రేషన్లకు స్లాట్ విధానం

రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో సోమవారం నుంచి స్లాట్ నమోదు విధానం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

» 2లో

## రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడి..

ఈ కబురు: రష్యా ఉక్రెయిన్ యుద్ధం మరోసారి భీకర స్థాయికి చేరుకుంది. ఇరు దేశాలు ఒకరిపై ఒకరు భారీ దాడులు చేసుకున్నాయి. ఉక్రెయిన్‌పై డ్రోన్లు, క్షిపణులతో రష్యా విరుచుకుపడింది. కీవ్ ఆర్మీ ట్రెయినింగ్ యూనిట్‌పై దాడి చేసింది. ఈ ఘటనలో 12 మంది ఉక్రెయిన్ సైనికులు మరణించగా మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డట్టు ఉక్రెయిన్ గ్రౌండ్ ఫోర్సెస్ తెలిపింది. అయితే అటాక్ టైంలో అక్కడ సైనిక కవాతు జరగలేదని అంతేగాక జవాన్లు అక్కడ గుమిగూడలేదని పేర్కొంది. కాగా, ఇరు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా అతి పెద్ద డ్రోన్ దాడి నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ దాడుల్లో భాగంగా రష్యా 472 డ్రోన్లు, ఏడు క్షిపణులను ప్రయోగించినట్టు ఉక్రెయిన్ వైమానిక దళ కమ్యూనికేషన్స్ చీఫ్ యూరి ఇగ్నాట్ తెలిపారు. వాటిలో ఒక క్షిపణి ఉక్రెయిన్‌లోని సైనిక శిక్షణా విభాగాన్ని ఢీకొట్టగా నష్టం జరిగినట్టు పేర్కొన్నారు.



తరువాయి 3లో



## ముస్లిం ఓట్ల కోసమే బుజ్జగింపు రాజకీయాలు

బంగ్లాదేశ్ నుంచి అక్రమ వలసలను ప్రోత్సహిస్తున్నారు

బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధ్వజం

» 3లో

## ఈ వారంలో హైదరాబాద్‌కు ప్రభాకర్‌రావు!



ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ఎట్టకేలకు అమెరికా నుంచి భారత్‌కు తిరిగి రానున్నట్లు సమాచారం. తాను హైదరాబాద్ వెళ్లేందుకు ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్ (ఎమర్జెన్సీ సర్టిఫికెట్-ఈసీ) జారీ చేయాలని ప్రభాకర్‌రావు అమెరికాలోని భారత ఎంబసీలో సోమవారం దరఖాస్తు సమర్పించనున్నట్లు తెలిసింది.

» 2లో

పోలీసు సేవా పతకాలు ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం.. 11 మందికి శౌర్య పతకం

» 3లో

కీలక రేట్లలో మరోసారి కోతకు అవకాశం

» 4లో

శ్రేయస్ కెప్టెన్సీ ఇన్నింగ్స్... ఐపీఎల్ ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్

» 6లో



పచ్చని ప్రకృతి నడుమ చిరునవ్వులు చిందిస్తోన్న బ్యూటిఫుల్ నటి..

» 5లో



మరోసారి రూ. 2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు

» 4లో





## తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యూపీఎఫ్

తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యునైటెడ్ ఫులే ఫ్రంట్ (యూపీఎఫ్) పనిచేస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

» 2లో

మొదటి పేజీ తరువాయి

## మావోయిస్టుల మరో కంచుకోటపై గురి



ఇప్పటికే కర్రెగుట్టలను జల్లెడ పట్టడంతోపాటు అబూజ్‌మడ్‌లోకి చొచ్చుకెళ్లిన బలగాలు.. ఛత్తీస్‌గఢ్‌మహారాష్ట్ర సరిహద్దుల్లోని మరో కీలక అభయారణ్యం దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఆ రెండు రాష్ట్రాలను విడదీసే ఇంద్రావతి నదిని ఆనుకొని ఉన్న నేషనల్ పార్క్ అడవులను జల్లెడ పట్టడంపై దృష్టి సారించారంటూ వస్తున్న వార్తలు మావోయిస్టుల్లో కలకలం రేపుతున్నాయి. మావోయిస్టులకు మరో రహస్యస్థావరంగా ఉన్న నేషనల్ పార్క్ అభయారణ్యంలో పార్టీ అగ్రనేతలు తలదాచుకుని ఉన్నారన్న అంచనాతో కేంద్ర సాయుధ బలగాలు సమాయత్తమైనట్లు తెలుస్తోంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో సుమారు 2,800 చదరపు కి.మీ. విస్తీర్ణంలో ఉన్న నేషనల్ పార్క్ అడవులను మావోయిస్టులు కంచుకోటగా ఎంచుకున్నారు. అక్కడి బీజాపూర్ జిల్లా నుంచి ఇంద్రావతి నది మీదుగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉండటంతో మావోయిస్టులు నేషనల్ పార్క్ అడవుల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలను సాగించారు. కర్రెగుట్టలను జల్లెడ పట్టిన సమయంలో తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు కమిటీతోపాటు ఆ పార్టీ కీలక నేత హిడ్మా ప్రాతినిధ్యం వహించే పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ దళాల ఆచూకీ లభిస్తుందని కేంద్ర బలగాలు అంచనా వేశాయి. అయితే దాదాపు నెల రోజులపాటు జరిగిన ఎన్‌కౌంటర్లలో 20 మందికిపైగా మావోయిస్టులు మరణించినా.. అగ్రనేతలు మాత్రం చిక్కలేదు. దీంతో కీలక నేతలంతా నేషనల్ పార్క్ అడవుల్లోకి వెళ్లి ఉంటారని అంచనా వేస్తున్న కేంద్ర బలగాలు.. ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అయితే కొన్నిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో కూంబింగ్‌కు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ పరిణామం మావోయిస్టులకు కొంతమేరకు ఉపశమనం కలిగిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మొదటి పేజీ తరువాయి

## పూర్తిస్థాయి పరిశీలన తర్వాతే యువ వికాసం



**క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని అప్రమత్తం చేయండి: సీఎం**

రాష్ట్రంలో ధాన్యం కొనుకోలుకు సంబంధించిన అంశాలపై మంత్రులు క్షేత్రస్థాయి పరిస్థితులను సీఎంకు వివరించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని ఈ సందర్భంగా మంత్రులు అభినందించారు. కాగా ధాన్యం కొనుగోళ్లపై సీఎం జిల్లాల వారీగా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులతో పాటు ప్రభుత్వం తీసుకోవల్సిన చర్యలపై చర్చించారు. వానాకాలం సీజన్ ప్రారంభం కావడం.. రాష్ట్రానికి ముందస్తు రుతుపవనాలతో కలిగే ప్రయోజనాలు, నష్టాలపైనా చర్చించారు. ఈ సీజన్‌కు సంబంధించి పంటల సాగును వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో అధికార యంత్రాగాన్ని ఈ దిశగా అప్రమత్తం చేయాలని రేవంత్ చెప్పారు.

**ఆర్థికేతర అంశాలను పరిష్కరిద్దాం!**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఇప్పటికే ప్రభుత్వం సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయగా.. ఆ కమిటీ మంత్రివర్గ ఉప సంఘానికి నివేదిక సమర్పించింది. ఈ నివేదికలోని ప్రధాన అంశాలను సీఎం రేవంత్‌రెడ్డికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వివరించారు. ఉద్యోగుల సమస్యల్లో ప్రధానంగా ఆర్థికేతర అంశాలను పరిష్కరిస్తే వారికి కొంతమేర ఊరటగా ఉంటుందని, ఉద్యోగ సంఘాల డిమాండ్ కూడా ఇదేనని భట్టి చెప్పారు.
దీంతో ఆర్థికేతర అంశాల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగానే ఉందని, దీనిపై కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుందామని మంత్రులకు సీఎం సూచించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిపైనా, గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు, భూభారతి ద్వారా సమస్యల పరిష్కారం తదితర అంశాలపైనా ఈ సమావేశంలో చర్చించారు. రుతుపవనాలతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మంత్రులంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు.

## రాష్ట్రంలో ఓ కుటుంబ డ్రామా నడుస్తోంది

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలో ఇప్పుడు ఓ కుటుంబ డ్రామా నడుస్తోందని, అధికారంలో ఉన్నప్పుడు దండుకున్న సొమ్మును పంచుకోవడంలో తలెత్తిన గొడవలే ఇందుకు కారణమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలు చేసి దోచుకున్న ఆస్తుల కోసం జరుగుతున్న గొడవల్లో మనం పాత్రధారులం కావాల్సిన అవసరం లేదన్నారు. బీఆర్ఎస్ నేతల అవినీతి, అక్రమాలపై ప్రజలు ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. కేంద్రంలో మూడు సార్లు అధికారంలోకి వచ్చిన ఎన్‌డీఏ ప్రభుత్వం, ప్రధాని మోదీ ఆధ్వర్యంలో మచ్చలేని పాలన సాగిస్తోందన్నారు. మోదీ పాలనపై ఎలాంటి చర్చకైనా తాను సిద్ధమన్నారు. విద్యుత్, ఎరువులు, రైతుల సంక్షేమంపై చర్చకు సిద్ధమా? అని కాంగ్రెస్‌కు సవాలు విసిరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రావాలన్నారు. రాహుల్ గాంధీకి దేశ చరిత్ర తెలియదని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. కాగా, తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాయని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా యోగా దినోత్సవాన్ని నిర్వహించాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. బీజేపీ జిల్లా, మండల పార్టీ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలని సూచించారు.

**వర్క్‌షాప్‌కు పలువురు డుమ్మా..**

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వర్క్‌షాప్‌కు పలువురు పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు గైర్హాజరయ్యారు. మొత్తం 11 మంది ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల్లో కేవలం నలుగురు మాత్రమే హాజరయ్యారు. పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, డీకే అరుణ, ఆర్.కృష్ణయ్య, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రఘునందన్‌రావు హాజరయ్యారు. ఎంపీ కె.లక్ష్మణ్ నిజామాబాద్ పర్యటనలో ఉన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు అర్వింద్, గోడెం నగేశ్ గైర్హాజరయ్యారు.



## నేటి నుంచి అన్నిచోట్ల రిజిస్ట్రేషన్లకు స్లాట్ విధానం

ఈ కబురు, హైదరాబాద్: రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో సోమవారం నుంచి స్లాట్ నమోదు విధానం అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. దీంతోపాటు కృత్రిమ మేధ(ఏఐ) సేవలను ఉపయోగించుకొని వాట్సప్ చాట్‌బాట్‌తో ప్రజలకు మరింత సమర్థంగా సేవలు అందించనున్నట్లు చెప్పారు. ఆదివారం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు గాను పైలట్ ప్రాజెక్టు కింద రెండు విడతల్లో 47 కార్యాలయాల్లో స్లాట్ విధానం అమలు చేశాం. ఈ సేవలపై 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ విధానం రాష్ట్ర అవతరణ దినోత్సవం నుంచి అమలు చేస్తున్నాం. పారదర్శకత, అవినీతి రహిత సేవలు అందించేందుకు ఈ విధానం తీసుకొచ్చాం. పైలట్ ప్రాజెక్టు అమలు చేసిన కార్యాలయాల్లో 45,191 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. సాధారణ పద్ధతి కన్నా మూడు వేల డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయి.

**సందేహాలు నివృత్తి చేసుకునేలా..**

రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ నమోదుతోపాటు ఏఐ అనుసంధానంతో కూడిన చాట్‌బాట్‌మేధ 82476 23578 వాట్సప్ నంబరును అందుబాటులోకి తీసుకువచ్చాం. రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి ఏవైనా సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవడానికి వీలుంటుంది. రిజిస్ట్రేషన్ కార్యాలయం ఉన్న ప్రాంతం, స్లాట్ ఖాళీల వివరాలు, సమయం.. తదితర వివరాలు తెలుసుకోవచ్చు. గిఫ్ట్ డీడ్, సేల్ డీడ్‌పై రిజిస్ట్రేషన్ ఛార్జీలు, మార్కెట్ ధరలు తదితర అన్ని అంశాలకు సంబంధించి సమాచారం తెలుసుకోవచ్చు. స్థిరాస్తి రంగంలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేలా లే అవుట్‌లలో డబుల్ రిజిస్ట్రేషన్ జరగకుండా.. రిజిస్ట్రేషన్ పూర్తయిన వాటి వివరాలు వినియోగదారులు తెలుసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. రిజిస్ట్రేషన్ కార్యాలయంతోపాటు బిల్డర్ లేదా డెవలపర్ వద్ద లే అవుట్‌లకు సంబంధించిన వివరాలు పూర్తి స్థాయిలో ఉండేలా 'డెవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్'ను త్వరలో తీసుకొచ్చేందుకు కార్యాచరణ చేపట్టాం. ఈ మాడ్యూల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తయిన ప్లాట్ల వివరాలు ఎరుపు రంగులో కనిపిస్తాయి. స్లాట్‌తో పనిభారం పెరగకుండా రద్దీ ఉండే కార్యాలయాల్లో అదనపు సిబ్బందిని నియమించాం. మధ్యాహ్న భోజన విరామం మినహాయించి ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య స్లాట్ నమోదు చేసుకోవచ్చు. నిత్యం 48 స్లాట్‌లు ఉంటాయి. అత్యవసర కారణాలతో స్లాట్ నమోదు చేసుకోలేని వారికి సాయంత్రం 5.30 గంటలకు నేరుగా రిజిస్ట్రేషన్ చేసుకునేలా అనుమతి ఇచ్చాం" అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.




మొదటి పేజీ తరువాయి

## తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యూపీఎఫ్

**కార్యవర్గాన్ని ప్రకటించిన కవిత**

ఈ కబురు,బంజారాహిల్స్, న్యూస్‌టుడే: తెలంగాణ జాగృతి అనుబంధ సంస్థగా యునైటెడ్ ఫులే ఫ్రంట్ (యూపీఎఫ్) పని చేస్తుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో యూపీఎఫ్ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యూపీఎఫ్ కార్యవర్గాన్ని ప్రకటించారు. కన్వీనర్‌గా బొల్లా శివశంకర్, కోఆర్డినేటర్‌గా ఆలకుంట హరి, సలహాదారుగా గట్టు రామచంద్రరావుతోపాటు మరో 50 మందిని సహ కన్వీనర్లుగా నియమించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. తెలంగాణ జాగృతి, యూపీఎఫ్ ఐక్య పోరాటాల వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పిస్తూ వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టిందన్నారు. బీసీల రిజర్వేషన్లు అమల్లోకి వచ్చేంతవరకూ తాము ఉద్యమాలు కొనసాగిస్తామని స్పష్టంచేశారు.



## సీఎం రేవంత్‌ను కలిసిన పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ..

ఈ కబురు: పద్మశ్రీ పురస్కార గ్రహీత, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఇవాళ ఉదయం తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ని ఆయన నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అత్యంత ప్రతిష్టాత్మక పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్న మందకృష్ణ మాదిగను సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అదేవిధంగా సామాజిక న్యాయం తో పాటు ఎస్సీ వర్గీకరణ లో ఆయన చేసిన కృషిని సీఎం ఎంతగానో కొనియాడారు. ఇరువురు నేతలు ఎస్సీ వర్గీకరణ ఉద్యమ ప్రస్థానంతో పాటు ఎమ్మార్పీఎస్ చేపట్టిన ఉద్యమంలోని కీలక ఘట్టాలను, ఎదురైన సవాళ్లను, గత అనుభవాలను మంద కృష్ణ మాదిగ సీఎం రేవంత్‌తో ప్రస్తావిస్తూ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



మొదటి పేజీ తరువాయి

## నేడు తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



**తెలంగాణ ఆవిర్భావ వేడుకలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. పోలీసుల కవాతు అనంతరం సీఎం ప్రసంగిస్తారు.**

**పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ పతాకం ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి**

ఈ కబురు, హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ వేడుకలు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. పోలీసుల కవాతు అనంతరం సీఎం ప్రసంగిస్తారు. ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసులకు మెడల్స్ అందజేస్తారు. అంతకుముందు అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు. అన్ని జిల్లాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీచేసింది. వేడుకలను పార్టీల ఆధ్వర్యంలోనూ నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయం గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. భారాస కార్యాలయం తెలంగాణ భవన్‌లో మండలి ప్రతిపక్షనేత మధుసూదనాచారి పతాకావిష్కరణ చేయనున్నారు. అమెరికాలో పార్టీ రజతోత్సవాల్లో పాల్గొంటున్న కేటీఆర్.. అక్కడ తెలంగాణ ఆవిర్భావ సంబరాల్లో పాల్గొంటారు. భాజపా ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కేంద్ర మంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.

మొదటి పేజీ తరువాయి

## ఈ వారంలో హైదరాబాద్‌కు ప్రభాకర్‌రావు!



**ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ఎట్టకేలకు అమెరికా నుంచి భారత్‌కు తిరిగి రానున్నట్లు సమాచారం. తాను హైదరాబాద్ వెళ్లేందుకు ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్ (ఎమర్జెన్సీ సర్టిఫికెట్-ఈసీ) జారీ చేయాలని ప్రభాకర్‌రావు అమెరికాలోని భారత ఎంబసీలో సోమవారం దరఖాస్తు సమర్పించనున్నట్లు తెలిసింది.**

**అమెరికాలోని భారత ఎంబసీలో నేడు దరఖాస్తు**

ఈ కబురు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసు ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు ఎట్టకేలకు అమెరికా నుంచి భారత్‌కు తిరిగి రానున్నట్లు సమాచారం. తాను హైదరాబాద్ వెళ్లేందుకు ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్ (ఎమర్జెన్సీ సర్టిఫికెట్ ఈసీ) జారీ చేయాలని ప్రభాకర్‌రావు అమెరికాలోని భారత ఎంబసీలో సోమవారం దరఖాస్తు సమర్పించనున్నట్లు తెలిసింది. దరఖాస్తు అనంతరం రెండు రోజుల్లో ఎంబసీ డాక్యుమెంట్‌ను జారీ చేసే అవకాశముంది. ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్ అందిన మూడు రోజుల్లో హైదరాబాద్‌కు వచ్చి కేసు దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్న నేపథ్యంలో ప్రభాకర్‌రావు జూన్ మొదటి వారంలో తిరిగి రానున్నట్లు సమాచారం. భారాస ప్రభుత్వ హయాంలో ఫోన్ అక్రమ ట్యాపింగ్ జరిగిందంటూ పంజాగుట్ట ఠాణాలో గతేడాది మార్చి 10న కేసు నమోదైన మరుసటి రోజే ప్రభాకర్‌రావు అమెరికా వెళ్లిపోయారు. ఆయనను రప్పించేందుకు సిట్ అధికారులు అన్ని రకాలుగా ప్రయత్నించారు. ముందస్తు బెయిల్ మంజూరు కోసం ఆయన చేసుకున్న అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చడంతో ఇటీవలే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీంతో విచారణకు సహకరిస్తానని అండర్‌టేకింగ్ ఇవ్వాలంటూ ప్రభాకర్‌రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తర్వాత విచారణ చేస్తామని, దర్యాప్తు అధికారులు ఆయనపై బలవంతపు చర్యలకు పాల్పడరాదని స్పష్టం చేసింది. హైదరాబాద్ వచ్చిన అనంతరం విచారణలో ప్రభాకర్‌రావు ఏం చెబుతారనే ఉత్కంఠ నెలకొంది. అప్పుడే కీలక రాజకీయ నేతల ప్రమేయంపై స్పష్టత రానుండటంతో ఆయన విచారణకు ప్రాధాన్యం సంతరించుకొంది.



## ఈశాన్యంలో భారీ వర్షాలు.. 'డేంజర్' లెవల్‌లో బ్రహ్మపుత్ర!

ఈ కబురు,ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అస్సాం, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్‌లలోని అనేక జిల్లాల్లో వరదల ప్రభావం అధికంగా ఉంది. పలుచోట్ల బ్రహ్మపుత్ర నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు మణిపుర్ గవర్నర్‌తో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అస్సాంలోని 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు 78వేల మంది తీవ్రంగా ప్రభావితమైనట్లు అంచనా. రోడ్డు, రైలు, ఫెర్రీ సర్వీసులకు అంతరాయం కలుగుతోంది. డిబ్రూగఢ్ జిల్లాలో బ్రహ్మపుత్ర ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. గువాహటిలో ఆదివారం కూడా ఎడతెరిపిలేని వర్షం కురిసింది. వర్షాల కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకు ఎనిమిది మంది చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు. సిక్కింలోనూ రెండు మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగన్ జిల్లాలోని లాచెన్, లాచుంగ్ లోయ ప్రాంతాల్లో దాదాపు 1200లకుపైగా పర్యటకులు చిక్కుకుపోయినట్లు అంచనా. వర్షం తగ్గకపోవడం, తీస్తా నదిలో నీటి మట్టం పెరగడంతో రెస్క్యూ ఆపరేషన్‌కు ఆటంకం కలుగుతున్నట్లు సమాచారం. మున్షితాంగ్ సమీపంలో మే 29న తీస్తా నదిలోకి ఓ వాహనం దూసుకెళ్లగా.. ఆ ఘటనలో ఎనిమిది మంది పర్యటకుల ఆచూకీ ఇంకా తెలియలేదు. దజోంగు నియోజకవర్గంలో కీలక మార్గంగా ఉన్న ఫిడాంగ్ బైలీ వంతెన అడుగుభాగం భారీ వరదలకు తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించారు. అదే ప్రాంతం ఎగువ భాగంలో కొండచరియలు విరిగి పడటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అరుణాచల్ ప్రదేశ్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పలుచోట్ల కొంచదచరియలు విరిగిపడ్డాయి. సిగిన్ నది ఉప్పొంగి ప్రవహిస్తోండడం డజోరిజోలో ఆకస్మిక వరదలకు కారణమైంది. మణిపుర్‌లోనూ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గత రెండు రోజుల్లోనే దాదాపు 900 ఇళ్లు దెబ్బతినట్లు అంచనా. ఖురియా, చెకాన్ సహా తూర్పు ఇంఫాల్‌లో అనేక ప్రాంతాలు ముంపునకు గురైనట్లు అధికారులు వెల్లడించారు.



# రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడి..



ఈ కబురు: రష్యా ఉక్రెయిన్ యుద్ధం మరోసారి భీకర స్థాయికి చేరుకుంది. ఇరు దేశాలు ఒకరిపై ఒకరు భారీ దాడులు చేసుకున్నాయి. ఉక్రెయిన్‌పై డ్రోన్లు, క్షిపణులతో రష్యా విరుచుకుపడింది. కీవ్ ఆర్మీ ట్రెయినింగ్ యూనిట్‌పై దాడి చేసింది. ఈ ఘటనలో 12 మంది ఉక్రెయిన్ సైనికులు మరణించగా మరో 60 మంది తీవ్రంగా గాయపడ్డట్టు ఉక్రెయిన్ గ్రౌండ్ ఫోర్సెస్ తెలిపింది. అయితే అటాక్ టైంలో అక్కడ సైనిక కవాతు జరగలేదని అంతేగాక జవాన్లు అక్కడ గుమిగూడలేదని పేర్కొంది. కాగా, ఇరు దేశాల మధ్య యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యా అతి పెద్ద డ్రోన్ దాడి నిర్వహించడం ఇదే తొలిసారి. ఈ దాడుల్లో భాగంగా రష్యా 472 డ్రోన్లు, ఏడు క్షిపణులను ప్రయోగించినట్టు ఉక్రెయిన్ వైమానిక దళ కమ్యూనికేషన్స్ చీఫ్ యూరి ఇగ్నాట్ తెలిపారు. వాటిలో ఒక క్షిపణి ఉక్రెయిన్‌లోని సైనిక శిక్షణా విభాగాన్ని ఢీకొట్టగా నష్టం జరిగినట్టు పేర్కొన్నారు. రష్యా దాడులకు ప్రతీకారంగా ఉక్రెయిన్ సైతం రష్యాపై అటాక్ చేసింది. సైబీరియాతో పాటు ఇతర వైమానిక స్థావరాలపై భారీ డ్రోన్ దాడులకు పాల్పడింది. ముర్మాన్‌స్క్‌లోని ఒలెన్యా ఎయిర్ బేస్, ఇర్కుట్‌స్క్‌లోని బెలాయా ఎయిర్ బేస్, ఇవనోవోలోని ఇవనోవో, డయాగిలేవో ఎయిర్ బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నట్టు సెక్యూరిటీ సర్వీస్ ఆఫ్ ఉక్రెయిన్ తెలిపింది. ఈ దాడుల్లో 40 రష్యాన్ యుద్ధ విమానాలు ధ్వంసమైనట్టు వెల్లడించింది. ఇందులో టీయూ95, టీయూ22 వంటి బాంబర్లు సైతం ఉన్నాయి. ఇవి ఉక్రెయిన్‌పై దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించడానికి రష్యా మోహరించిన వ్యూహాత్మక బాంబర్లు కావడం గమనార్హం. అయితే దీనిని రష్యా అధికారికంగా ధ్రువీకరించలేదు. అయితే సైబీరియాలోని ఇర్కుట్స్క్ ప్రాంతంలో తమ సైనిక స్థావరంపై డ్రోన్ దాడి జరిగినట్టు ఆ ప్రాంత గవర్నర్ తెలిపారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి సైబీరియాలో దాడి జరగడం కూడా ఇదే తొలసారి.

రష్యా సైన్యానికి భారీ ఎదురుదెబ్బ !

రష్యా ప్రభుత్వం అధికారికంగా నష్టానికి సంబంధించిన వివరాలు వెల్లడించనప్పటికీ ఈ దాడితో రష్యా మౌలిక సదుపాయాలకు తీవ్రమైన దెబ్బగా భావిస్తున్నారు. ఈ దాడులు ఉక్రెయిన్ వ్యూహాత్మక విధానంలో ఒక మలుపును సూచిస్తాయని, రష్యన్ భూభాగంలోకి లోతుగా ఖచ్చితత్వంతో దాడి చేయగల దాని సామర్థ్యాన్ని ప్రదర్శిస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, ఇస్తాంబుల్‌లో సోమవారం ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు జరనున్నాయి. తమ ప్రతినిధి బృందం ఈ చర్చల్లో పాల్గొంటుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ప్రకటించారు. ఈ క్రమంలోనే ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం హాట్ టాపిక్ గా మారింది.

# గాజాలో అన్నార్తులపైకి కాల్పులు 31 మంది మృతి



## 170 మందికి పైగా గాయాలు

## ఇజ్రాయెల్‌పై విమర్శల వెల్లువ

ఈ కబురు,రఫా (గాజా స్ట్రిప్): గాజాలో మాటలకందని ఘోరం చోటుచేసుకుంది. అన్నార్తులపై ఇజ్రాయెల్ సైన్యం ఆదివారం విచక్షణారహితంగా కాల్పులకు తెగబడింది. ఐరాస సాయాన్ని కాదని అమెరికా దన్నుతో గాజా లో ఇజ్రాయెల్ స్వయంగా సహాయ కేంద్రాలను మొదలుపెట్టడం తెలిసిందే. వాటినుంచి ఆహారం తెచ్చుకోవడానికి వెళ్తున్న వారిపై తూటాల వర్షం కురిపించింది. ఆ కాల్పుల్లో 31 మంది పాలస్తీనావాసులు బలయ్యారు. కనీసం 170 మందికి పైగానే గాయపడ్డట్టు హమాస్ వర్గాలు వివరించాయి. సహాయ కేంద్రానికి కిలోమీటర్ దూరంలో ఈ దారుణం జరిగినట్టు గాజా ఆరోగ్య శాఖ సిబ్బందితో పాటు ప్రత్యక్ష సాక్షులు కూడా తెలిపారు. దీనిపై అంతర్జాతీయంగా దుమారం రేగుతుండటంతో ఇజ్రాయెల్ తీవ్ర ఇరకాటంలో పడింది. అలాంటి ఉదంతమేదీ ఇప్పటిదాకా తమ దృష్టికి రాలేదని నెతన్యాహు ప్రభుత్వం చెప్పుకొచ్చింది. దీనిపై దర్యాప్తు చేపట్టినట్టు పేర్కొంది.

# ముస్లిం ఓట్ల కోసమే బుజ్జగింపు రాజకీయాలు



ఈ కబురు,కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిప్పులు చెరిగారు. ముస్లిం ఓటు బ్యాంకు కోసం బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం ముస్లింల ఓట్ల కోసమే ఆపరేషన్ సిందూర్‌ను, వక్ఫ్ సవరణ బిల్లును గుడ్డిగా వ్యతిరేకిస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం కోల్‌కతాలో బీజేపీ నేతలు, కార్యకర్తల సమావేశంలో అమిత్ షా ప్రసంగించారు. వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మమతా బెనర్జీ శకం 2026లో ముగుస్తుందని తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్‌ను వ్యతిరేకిస్తున్న ముఖ్యమంత్రికి మహిళలు తగిన గుణపాఠం నేర్పడం ఖాయమని పేర్కొన్నారు. ఉగ్రవాదులను నరేంద్ర మోదీ ప్రభుత్వం అణచివేయడాన్ని మమతా బెనర్జీ భరించలేపోతున్నారని విమర్శించారు. ఓటు బ్యాంక్‌ను కాపాడుకొనేందుకు ఎంతకైనా దిగజారుతున్నారని ఆక్షేపించారు. పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో పశ్చిమబెంగాల్ వ్యక్తులు కూడా మరణించారని, అయినప్పటికీ మమతా బెనర్జీ నోరెత్తలేదని తప్పుపట్టారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో జరిగిన హింసాకాండ వెనుక తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ హస్త ఉందని అమిత్ షా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహంతోనే బంగ్లాదేశ్ నుంచి బెంగాల్‌లోకి అక్రమ వలసలు కొనసాగుతున్నాయని చెప్పారు. వసలదార్ల కోసం సరిహద్దులు తెరిచేశారని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు కేవలం రాష్ట్ర భవిష్యత్తుతోనే కాకుండా.. దేశ భద్రతతో ముడిపడి ఉన్నాయని అమిత్ షా స్పష్టంచేశారు. బంగ్లాదేశ్ నుంచి వలసలను ఆపే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని తేల్చిచెప్పారు. ఎన్నికల్లో హింసను ఆశ్రయించకుండా డిపాజిట్లు అయినా తెచ్చుకోలగరా? అని మమతా బెనర్జీకి సవాలు విసిరారు. ఇదిలా ఉండగా, అమిత్ షా ఆరోపణలను తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఖండించింది. సరిహద్దుల రక్షణ కేంద్ర హోంశాఖ పరిధిలోనే ఉంటుందని గుర్తుచేసింది. బంగ్లాదేశ్ నుంచి వలసదార్లు రాకుండా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించింది.

# క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మల్లు రవి



కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా ఎంపీ మల్లు రవి... గత ఛైర్మన్ చిన్నారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం దిల్లీ నుంచి విమానాశ్రయం వచ్చిన రవి... అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌తో గాంధీభవన్‌కు తరలివచ్చారు.
మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌గౌడ్‌లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లు రవి. పక్కన వంశీచంద్‌రెడ్డి తదితరులు

ఈ కబురు, దిల్లీ, ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గా ఎంపీ మల్లు రవి... గత ఛైర్మన్ చిన్నారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం దిల్లీ నుంచి విమానాశ్రయం వచ్చిన రవి... అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌తో గాంధీభవన్‌కు తరలివచ్చారు. బాధ్యతల స్వీకరణ అనంతరం.. ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌లను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లు రవి మీడియాతో మాట్లాడుతూ... పార్టీలో ప్రజాస్వామ్యం ఉంటుందని, కానీ నాలుగు గోడల మధ్య పార్టీకి చెప్పాల్సిన అంశాలను బయట మాట్లాడుతూ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని నేతలకు సూచించారు. ఎంపీలు బలరాం నాయక్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీకృష్ణ, శంకరయ్య, రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, శ్రీహరి ముదిరాజ్, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, సీనియర్ నేతలు వి.హనుమంతరావు, అంజన్‌కుమార్‌యాదవ్, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు దిల్లీలో మల్లు రవి విలేకరులతో మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న మాదిరే రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గా యువత ఆర్థికాభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం సామాజిక బాధ్యత (జీఎస్ఆర్) కింద కృషిచేస్తోందన్నారు.

# పోలీసు సేవా పతకాలు

## ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం.. 11 మందికి శౌర్య పతకం

**తెలంగాణ ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు సేవా పతకాలను ప్రకటిస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు.**

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు సేవా పతకాలను ప్రకటిస్తూ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసుశాఖలో పనిచేసే గ్రేహౌండ్స్‌కు చెందిన 9 మందికి శౌర్య పతకం దక్కింది. 16 మంది మహోన్నత సేవా పతకం, 92 మంది ఉత్తమ సేవా పతకం, 47 మంది కఠిన సేవా పతకం, 461 మంది సేవా పతకం అందుకోనున్నారు. ఇక అవినీతి నిరోధక శాఖలో ఒకరికి మహోన్నత సేవా, నలుగురికి ఉన్నత సేవా, 17 మందికి సేవా పతకాలు దక్కాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలో ఒకరికి ఉత్తమ సేవా, ఐదుగురికి సేవా పతకాలు వచ్చాయి. డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ శాఖలో ఇద్దరికి శౌర్య పతకం, ఒకరికి మహోన్నత పతకం, ముగ్గురికి ఉత్తమ సేవా, 14 మందికి సేవా పతకాలు దక్కాయి. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఒకరికి మహోన్నత సేవా, ముగ్గురికి ఉత్తమ సేవా, 15 మందికి సేవా పతకాలను ప్రభుత్వం ప్రకటించింది.

# దేశంలో 3,758కి చేరిన కొవిడ్ యాక్టివ్ కేసులు.. ఈ వైరస్‌పై WHO ఏం చెప్పిందంటే?




**దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం జూన్ 1న ఉదయం 8గంటల వరకు దేశ వ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 3,758కి పెరిగింది.**

ఈ కబురు: దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించిన గణాంకాల ప్రకారం జూన్ 1న ఉదయం 8గంటల వరకు దేశ వ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 3,758కి పెరిగింది. వీటిలో అత్యధికంగా కేరళలోనే 1400 కేసులు ఉండగా.. మహారాష్ట్రలో 485, దిల్లీ 436, గుజరాత్ 320, పశ్చిమ బెంగాల్ 287, కర్ణాటక 238, ఆంధ్రప్రదేశ్ 23, తెలంగాణ 3 చొప్పున.. ఇలా పలు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తంగా 3758 యాక్టివ్ కేసులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే, ఈ ఏడాది కొవిడ్ సంబంధిత మరణాలు 28కి చేరాయి.

డబ్ల్యూహెచ్‌వో ఏమందంటే?

కొవిడ్ మళ్లీ వ్యాప్తి చెందుతుండటంపై ప్రపంచ ఆరోగ్యసంస్థ ఇటీవల స్పందించింది. వ్యాప్తిలో ఉన్న ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8.1 సబ్ వేరియంట్లను 'పర్యవేక్షణలో ఉన్న వేరియంట్లు'గా వర్గీకరించింది. పలు దేశాల్లో విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న ఎన్‌బీ.1.8.1 వేరియంట్‌తో ఇన్ఫెక్షన్ల వ్యాప్తి, ఆస్పత్రుల్లో చేరికలు ఒకేసారి పెరుగుతున్నా.. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డేటా ప్రకారం ఇతర వేరియంట్లతో పోలిస్తే ఇది తీవ్రమైన అనారోగ్యానికి దారితీస్తుందన్న సూచనలు ఏమీ లేవని మే 23న పేర్కొంది. ఇప్పటికే ఆమోదం పొందిన కొవిడ్ వ్యాక్సిన్లు ఈ వేరియంట్ లక్షణాలు, ప్రభావాన్ని కట్టడి చేయడంలో సమర్థంగా పనిచేస్తాయని భావిస్తున్నట్లు తెలిపింది.

ఇన్ఫెక్షన్ తీవ్రత తక్కువే.. అప్రమత్తంగా ఉండాలి: ఐసీఎంఆర్

మరోవైపు, ఐసీఎంఆర్ వెల్లడించిన సమాచారం ప్రకారం.. దేశంలోని పశ్చిమ, దక్షిణ ప్రాంతాల్లో జీనోమ్ సీక్వెన్సింగ్ నమూనాల ద్వారా ఈ కొత్త వేరియంట్లు ఒమిక్రాన్ జాతికి చెందిన ఉప రకాలుగా తేలింది. 2022లో ప్రపంచ వ్యాప్తంగా కొవిడ్ శరవేగంగా విస్తరించడానికి ఒమిక్రాన్ కారణమన్న విషయం తెలిసిందే. అయితే, ఎల్ఎఫ్.1, ఎక్స్ఎఫ్‌జీ, జేఎన్. 1, ఎన్‌బీ. 1.8.1 వంటి వేరియంట్లను మన దేశంలో గుర్తించగా.. వీటిలో మొదటి మూడు వేరియెంట్లే ప్రబలంగా ఉన్నట్లు ఐసీఎంఆర్ చీఫ్ రాజీవ్ బహల్ ఇటీవల తెలిపారు.

కొవిడ్ కేసుల పెరుగుదలపై ఇటీవల రాజీవ్ బెహల్ 'పీటీఐ'వార్తా సంస్థతో మాట్లాడుతూ.. తొలుత దక్షిణ భారతదేశం నుంచి నమోదైన కేసులు.. ఆ తర్వాత పశ్చిమం నుంచి, ఇప్పుడేమో ఉత్తర భారతం నుంచి వస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులన్నింటినీ ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ ద్వారా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రస్తుతానికి ఈ ఇన్‌ఫెక్షన్ల తీవ్రత తక్కువగా ఉందన్న ఆయన.. ఎలాంటి భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. "ఎప్పుడైనా ఇన్ఫెక్షన్లు పెరిగితే.. మూడు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వైరస్ వ్యాప్తి ఎంత మేరకు ఉంది అనేది మొదట చూడాలి. గతంలో కొవిడ్ 19 వచ్చినప్పుడు కేసులు రెండు రోజుల్లోనే రెట్టింపు కావడం మనం చూశాం. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఇక రెండోది, కొత్త వేరియంట్లు రోగనిరోధక శక్తిపై ఏమేరకు ప్రభావం చూపుతున్నాయనేది చూడాలి. మూడోది, వైరస్ తీవ్రత ఎంతో చూడాలి. గతంతో పోలిస్తే.. ఈ వేరియంట్‌లో అంత తీవ్రత కనబడటం లేదు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదుగానీ, అప్రమత్తంగా, సర్వసన్నద్ధతతో ఉండాలి" అని సూ



# డాలస్‌లో కేటీఆర్‌కు ఘన స్వాగతం

**అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం డాలస్‌కు చేరుకున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ ప్రవాసులు, పార్టీ ముఖ్య నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.**

డాలస్‌కు చేరుకున్న కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న తెలంగాణ ప్రవాసులు

ఈ కబురు, హైదరాబాద్: అమెరికా పర్యటనలో భాగంగా ఆదివారం డాలస్‌కు చేరుకున్న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు తెలంగాణ ప్రవాసులు, పార్టీ ముఖ్య నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. డాలస్‌లోని డాక్టర్ పెప్పర్ ఎరినా ప్రాంగణంలో జూన్ 1 సాయంత్రం 4 గంటలకు (భారత కాలమాన ప్రకారం జూన్ 2 తెల్లవారుజామున 3 గంటలకు) నిర్వహించనున్న భారాస రజతోత్సవాలు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. మే 27వ తేదీన యూకేకు చేరుకున్న ఆయన అక్కడ మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యూకే పర్యటనలో తనకు సహకరించిన తెలంగాణ ప్రవాసులు, భారాస నాయకులు, అభిమానులకు కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.






## యూపీఐ యాప్‌తో నగదు నిల్వ పరిశీలన రోజుకు 50 సార్లే

నగదు రహిత చెల్లింపులు బాగా పెరిగాయి. వీటిని నిర్వహించే యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) యాప్‌లు, వినియోగదారులను ఆకట్టుకునేందుకు అనేక సేవలను తీసుకొస్తున్నాయి. ఇందులో ప్రధానమైనది బ్యాంకు ఖాతాలో ఎంత నగదు నిల్వ ఉందో తెలుసుకోవడం.

హైదరాబాద్: నగదు రహిత చెల్లింపులు బాగా పెరిగాయి. వీటిని నిర్వహించే యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్) యాప్‌లు, వినియోగదారులను ఆకట్టుకునేందుకు అనేక సేవలను తీసుకొస్తున్నాయి. ఇందులో ప్రధానమైనది బ్యాంకు ఖాతాలో ఎంత నగదు నిల్వ ఉందో తెలుసుకోవడం. ఇందుకోసం బ్యాంకు శాఖ/ఏటీఎం కేంద్రానికి వెళ్లే అవసరం తప్పింది. చాలామంది రోజులో ఎన్నోసార్లు, ఇలా ఖాతాలోని నిల్వను తమ యూపీఐ యాప్ ద్వారానే చూసుకుంటున్నారు. ఈ పరిశీలనకు పరిమితులను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) విధించబోతోంది. నెట్‌వర్క్‌పై భారం తగ్గించడం ద్వారా, వినియోగదారులకు మరింత మెరుగైన, అంతరాయం లేని సేవలు అందించడమే లక్ష్యంగా.. బ్యాంకులు, యూపీఐ సేవల సంస్థలకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం..

తమ బ్యాంకు ఖాతాలో ఎంత మొత్తం ఉందో, రోజులో 50 సార్లు మాత్రమే యూపీఐ యాప్ ద్వారా పరిశీలించుకోవచ్చు. యూపీఐ యాప్‌లు 2 వాడుతుంటే, ఒక్కోదాంట్లో 50 సార్ల చొప్పున తనిఖీ చేసుకోవచ్చు. విజయవంతమైన లావాదేవీ సమాచారంతో పాటు ఖాతాలో బ్యాలెన్స్ సమాచారాన్నీ వినియోగదారులకు పంపించాలని బ్యాంకులకు ఎన్‌పీసీఐ ఆదేశాలు జారీ చేసింది.

ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేసెస్) లావాదేవీల విషయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు వినియోగదారుల అనుమతితోనే జరగాలి.

క్రమానుగత పెట్టుబడులు, ఓటీటీలకు చెల్లింపుల వంటి ఆటోమేటెడ్ చెల్లింపులనూ రద్దీ లేని సమయాల్లోనే ప్రాసెస్ చేయాలి. రద్దీ సమయంలో ఆటోపేమెంట్ కోసం అభ్యర్థన పెట్టొచ్చు. కానీ, రద్దీ లేని సమయంలోనే దానికి చెల్లింపులు వెళ్తాయి. ఈ కొత్త మార్పులన్నీ ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయని ఎన్‌పీసీఐ తెలిపింది.




## టాటా హారియర్, మహీంద్రా ఎక్స్‌ఈవీ 7ఈ.. త్వరలో రాబోయే ఎస్‌యూవీలు ఇవే!

**ఈ ఏడాదిలో కొత్త ఎస్‌యూవీలు మార్కెట్లోకి రానున్నాయి. వాటి విశేషాలు ఇవే..**



దేశంలో ఎస్‌యూవీలకు ఆదరణ పెరుగుతోంది. దీంతో ప్రధాన వాహన తయారీ సంస్థలు వివిధ రకాల సౌకర్యాలతో కూడిన ఎస్‌యూవీలను తీసుకొచ్చేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈ ఏడాది అలా కొన్ని కొత్త మోడళ్లు, సరికొత్త అప్‌గ్రేడ్‌లతో కూడిన ఎస్‌యూవీలు మార్కెట్లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి. ఆ వివరాలు ఇవీ..

**టాటా హారియర్ ఈవీ**

టాటా మోటార్స్‌కు చెందిన హారియర్ ఈవీ ఈ నెలలోనే రాబోతోంది. మెరుగైన ఇంటీరియర్ స్పేస్, అద్భుతమైన ఫీచర్లతో దీన్ని తీసుకురానున్నారు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 500 కిలోమీటర్ల కంటే ఎక్కువ రేంజ్ ఇస్తుందని అంచనా. డ్యూయల్‌మోటార్ ఆల్‌వీల్ డ్రైవ్, మల్టీలింక్ రియర్ సస్పెన్షన్ సిస్టమ్‌తో వచ్చే అవకాశం ఉంది. స్పెసిఫికేషన్లు రివీల్ చేయనప్పటికీ జూన్ 3న మార్కెట్లో విడుదల చేయనున్నారు.

**మారుతీ సుజుకీ ఇ-విటారా**

మారుతీ సుజుకీ తొలి ఎలక్ట్రిక్ వాహనం ఇ విటారా కూడా ఈ నెలలో రానుంది. హ్యుందాయ్ క్రెటా ఈవీ, ఎంజీ జెడ్‌ఎస్ ఈవీ, మహీంద్రా బీఈ 6 వంటి కార్లతో పోటీ పడనుంది. 49 kWh, 61 kWh రెండు బ్యాటరీ ఎంపికలతో రానుంది. 500 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుందని కంపెనీ చెబుతోంది.

**హ్యుందాయ్ వెన్యూ ఫేస్‌లిఫ్ట్**

కాంపాక్ట్ ఎస్‌యూవీ అప్‌డేటెడ్ వెర్షన్‌యే హ్యుందాయ్ వెన్యూ ఫేస్‌లిఫ్ట్. సరికొత్త డిజైన్‌తో తీసుకొస్తున్నారు. ఫీచర్ల వివరాలు ప్రకటించలేదు. టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ, స్కోడా కైలాక్, మారుతీ సుజుకీ బ్రెజ్జా, కియా సోనెట్ వంటి మోడళ్లతో పోటీ పడనుంది.

**మెర్సిడెస్ -ఏఎంజీ జీ63 కలెక్టర్ ఎడిషన్**

ఏఎంజీ జీ63 ప్రత్యేక వెర్షన్ 'కలెక్టర్స్ ఎడిషన్'ను మెర్సిడెస్ బెంజ్ జూన్ 12న పరిచయం చేయనుంది. ఈ ఎస్‌యూవీ వేరియంట్ ప్రత్యేకంగా భారత మార్కెట్ కోసం రూపొందించారు. వైబ్రెంట్ కలర్, సిల్వర్ వీల్స్‌తో తీసుకొస్తున్నట్లు తాజాగా రివీల్ చేసిన టీజర్ చూస్తే తెలుస్తోంది. 4.0 లీటర్ టర్బో వీ8 ఇంజిన్ 577 hp, 850 Nm టార్క్ ఉత్పత్తి చేస్తుంది.

**మహీంద్రా ఎక్స్‌ఈవీ 7ఈ**

XUV700 తరహా డిజైన్‌తో మహీంద్రా ఎక్స్‌ఈవీ 7ఈ రానుంది. దీని గురించి పూర్తి వివరాల్ని కంపెనీ ఇంకా వెల్లడించలేదు. అయితే 59 kWh, 79kWh బ్యాటరీ ఆప్షన్లతో తీసుకురానున్నట్లు తెలుస్తోంది. సింగిల్ ఛార్జ్‌తో 500 కిలోమీటర్ల రేంజ్ ఇస్తుంది. ఈ ఏడాది ముగిసేలోపే మార్కెట్లోకి ఎంట్రీ ఇవ్వనుంది.




## కీలక రేట్లలో మరోసారి కోతకు అవకాశం

ఇటీవల వరుస రెండు సమావేశాల్లో భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) కీలక రేట్లను పావు శాతం చొప్పున తగ్గించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ద్రవ్యోల్బణం అనుకున్న లక్ష్యం 4 శాతం కంటే తక్కువకు పరిమితం చేయడంతో పాటు అమెరికా టారిఫ్ కారణంగా ఏర్పడిన ప్రపంచ అనిశ్చితి నేపథ్యంలో వృద్ధిని కొనసాగించేందుకు మూడోసారి 25 బేసిస్ పాయింట్ల కోత విధించవచ్చని నిపుణులు భావిస్తున్నారు. తదుపరి ద్రవ్య పరపతి విధాన కమిటీ(ఎంపీసీ) సమావేశం జూన్ 4న ప్రారంభం కానుంది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను 6న ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటిస్తారు. ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో కీలక రెపో రేటును రెండు సార్లు తగ్గించి 6 శాతానికి చేర్చిన ఆర్‌బీఐ, ఏప్రిల్‌లో పాలసీ వైఖరిని స్థిర విధానం నుంచి సర్దుబాటు వైఖరికి సవరించింది. ద్రవ్యోల్బణ పరిస్థితులు, ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆర్‌బీఐ మరోసారి 25 బేసిస్ పాయిట్లు తగ్గించే దిశగా ఆలోచించవచ్చని భావిస్తున్నాం. ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ముఖ్యమనే అంచనాలున్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ అన్నారు. అమెరికా ఇటీవల వాయిదా వేసిన టారిఫ్ అమలు జూలైతో ముగియనుంది. దీనివల్ల అంతర్జతీయ పరిణామాలు భారత ఆర్థికవ్యవస్థను ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై ఆర్‌బీఐ పరిశీలన ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ భాగం సీపీఐ ద్రవ్యోల్బణం 4 శాతం దిగువనే ఉండే అవకాశాల మధ్య ఆర్‌బీఐ ఎంపీసీ రేట్ల సడలింపును కొనసాగించవచ్చని ఇక్రా చీఫ్ ఎకనమిస్ట్ అదితి నాయర్ చెప్పారు. వచ్చే వారం 25 బేసిస్ పాయింట్ల రేటు కోత, ఆ తర్వాత తదుపరి రెండు విధాన సమీక్షలలో మరో రెండు కోతలు ఉంటాయని, చివరిగా రెపో రేటు 5.25 శాతానికి చేర్చవచ్చని ఆమె పేర్కొన్నారు.



## మరోసారి రూ. 2 లక్షల కోట్లు దాటిన జీఎస్టీ వసూళ్లు



భారత వస్తు,సేవల పన్ను వసూళ్లు మరోసారి భారీగా నమోదయ్యాయి. దేశీయ ఆర్థిక కార్యకలాపాలు పెరగడంతో ఈ ఏడాది మే నెలలో జీఎస్టీ ఆదాయం 16.4 శాతం పెరిగి రూ.2.01 లక్షల కోట్లకు చేరినట్లు ప్రభుత్వ గణాంకాలు ఆదివారం ప్రకటనలో వెల్లడించాయి. గతేడాది ఇదే నెలలో జీఎస్టీ వసూళ్లు రూ. 1.72 లక్షల కోట్లుగా ఉన్నాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తెలిపింది. అంతకుముందు నెలలో జీఎస్టీ వసూళ్లు ఆల్‌టైమ్ రికార్డు స్థాయిలో రూ. 2.37 లక్షల కోట్లకు చేరిన సంగతి తెలిసిందే. గత నెలలో దిగుమతి వస్తువుల నుంచి వసూలు చేసిన జీఎస్టీ 25.2 శాతం పెరిగింది. దేశీయ ఆర్థిక కార్యకలాపాల నుంచి వచ్చిన మొత్తం 13.7 శాతం వృద్ధి చెందాయి. దిగుమతుల నుంచి స్థూల జీఎస్టీ ఆదాయం రూ.51,266 కోట్లుగా ఉండగా, దేశీయ కార్యకలాపాల నుంచి రూ.1,49,785 కోట్లు వచ్చాయి. గత నెలలో సీజీఎస్టీ రూ.35,434 కోట్లు, ఎస్‌జీఎస్టీ రూ.43,902 కోట్లు, ఐజీఎస్టీ దాదాపు రూ.1.09 లక్షల కోట్లు, సెస్ నుండి వచ్చే ఆదాయం రూ.12,879 కోట్లు వచ్చాయి. మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు వంటి పెద్ద రాష్ట్రాలు 1725 శాతం వరకు వసూళ్లలో పెరుగుదలను సాధించాయి. గుజరాత్, ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు 6 శాతం మేర అధిక వసూళను నమోదు చేశాయని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

## దక్షిణాసియా వృద్ధికి భారతే ప్రధాన చోదకం

**ఈ ఏడాదితో పాటు వచ్చే సంవత్సరంలోనూ దక్షిణాసియా ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధిరేటు నమోదు చేయొచ్చనే ఆశాభావాన్ని ప్రపంచవ్యాప్త ముఖ్య ఆర్థికవేత్తలు వ్యక్తం చేశారు.**



**దిల్లీ:** ఈ ఏడాదితో పాటు వచ్చే సంవత్సరంలోనూ దక్షిణాసియా ఆర్థిక వ్యవస్థ బలమైన వృద్ధిరేటు నమోదు చేయొచ్చనే ఆశాభావాన్ని ప్రపంచవ్యాప్త ముఖ్య ఆర్థికవేత్తలు వ్యక్తం చేశారు. ఈ వృద్ధిలో భారతే ప్రధాన చోదకంగా మారుతుందని వాళ్లు అభిప్రాయపడినట్లు ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) తాజా నివేదికలో తెలిపింది. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థపై, అమెరికా వాణిజ్య విధానాలు దీర్ఘకాలిక ప్రభావం చూపించొచ్చనీ ప్రైవేట్, ప్రభుత్వ రంగాలకు చెందిన ఎక్కువ మంది ఆర్థికవేత్తలు అంచనా వేశారని వివరించింది. వ్యూహాత్మక వ్యాపార నిర్ణయాలు ఆలస్యం కావొచ్చని, మాంద్యం ముప్పు పెరగొచ్చని 87% మంది అభిప్రాయపడ్డారు.

**సర్వే నివేదిక ప్రకారం..**

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ వృద్ధి అంచనా ప్రాంతాల వారీగా వేర్వేరుగా ఉంది. ఉత్తర అమెరికాపై బలహీన వృద్ధి అంచనా వ్యక్తం కాగా.. ఆసియా పసిఫిక్ ప్రాంత వృద్ధి పుంజుకోవచ్చని, ఐరోపా ప్రాంత వృద్ధిపై అప్రమత్తతతో కూడిన ఆశావహ పరిస్థితితో ఉన్నట్లు వెల్లడించింది.

**చైనా వృద్ధి స్తబ్దుగా ఉండొచ్చు. ఈ ఏడాది జీడీపీ వృద్ధి 5 శాతంగా ఉండొచ్చు.**

అంతర్జాతీయంగా ప్రతికూల వాతావరణం ఉన్నా, ఈ ఏడాది దక్షిణాసియా ప్రాంతం బలమైన వృద్ధిని నమోదు చేయొచ్చని 33% మంది అంచనా వేశారు. అయితే భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రికతల వల్ల సవాళ్లు ఎదురవుతాయని, దక్షిణాసియా ప్రాంత ద్రవ్యోల్బణమూ పెరగొచ్చని అంచనా వేసింది.

దక్షిణాసియాలోని దిగ్గజ ఆర్థిక వ్యవస్థ అయిన భారత్ ఈ ప్రాంత వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. భారత జీడీపీ వృద్ధిని 2025కు 6.2%, 2026కు 6.3 శాతంగా అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అంచనా వేయడాన్ని నివేదిక ప్రస్తావించింది. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందం చర్చలు వేగవంతం కావడం సానుకూల అంశమని పేర్కొంది. వివిధ దేశాలు రక్షణ వ్యయ కేటాయింపులు పెంచుతుండటం, ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ రుణాలు పెరగడంపై ఆందోళన నెలకొంది. ప్రభుత్వ రుణాలు ముమ్ముందు పెరిగే అవకాశం ఉందని 86% మంది ఆర్థికవేత్తలు అంచనా వేశారు.

ఆర్థిక వ్యవస్థల వృద్ధిలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్ర పెరగొచ్చని, నికరంగా ఉద్యోగాల కోతకు ఇది దారితీయొచ్చని 47% మంది అభిప్రాయపడ్డారు.

అంతర్జాతీయ అనిశ్చితులు పెరగొచ్చని 82% మంది ఆర్థికవేత్తలు పేర్కొంటే, వచ్చే సంవత్సరంలో పరిస్థితులు మెరుగవ్వొచ్చని 56 శాతం మంది అంచనా వేశారు.





# నెక్స్ట్ టైమ్.. ప్రభాస్ మూవీపై రివ్యూ ఇస్తా: ప్రపంచ సుందరి



**ప్రభాస్ నటించిన ఓ సినిమాని ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు ప్రపంచ సుందరి ఓపల్ సుచాత . త్వరలోనే తాను ఆ సినిమా చూడాలనుకుంటున్నానని తెలిపారు.**

108 దేశాల అందగత్తెలను వెనక్కి నెట్టి ప్రపంచ సుందరి కిరీటాన్ని కైవసం చేసుకున్నారు థాయ్‌లాండ్ భామ ఓపల్ సుచాత . మిస్ వరల్డ్ 2025గా విజయం సాధించిన అనంతరం ఆమె జాతీయ మీడియాతో ముచ్చటించారు. భారతీయ సినిమాల గురించీ మాట్లాడారు. తనకు బాలీవుడ్ నటి అలియాభట్ తెలుసన్నారు. ఈ ప్రయాణంలో ఎంతో మంది సుందరీమణులు తనలో స్ఫూర్తి నింపారని చెప్పారు. భారత దేశం నుంచి ప్రపంచ సుందరిగా విజయాన్ని అందుకున్న వారిలో ఎవరంటే మీకు ఇష్టం అని ప్రశ్నించగా.. ''ఈ ప్రశ్నకు బదులు చెప్పడం చాలా కష్టం. నాకెంతో ఇష్టమైన మానుషి చిల్లర్‌ను ఫినాలేలో కలిశాను. అదే విధంగా నాకు ప్రియాంకా చోప్రా అంటే ఎంతో ఇష్టం. ఆమె నుంచి స్ఫూర్తి పొందాను. వీలున్నప్పుడు సినిమాలు చూస్తుంటా. బాలీవుడ్‌లో తెరకెక్కిన పలు చిత్రాలు ఇప్పటికే చూశాను. అలియాభట్ నాకు తెలుసు. ఆమె నటించిన 'గంగూబాయి కాఠియావాడి' నాకెంతో నచ్చింది. ప్రేక్షకులను ఆలోచింప చేసే చిత్రమది. 'బాహుబలి' సినిమా గురించి విన్నాను. కానీ, ఆ సినిమా ఇంకా చూడలేదు. మిస్ వరల్డ్ పోటీల్లో భాగంగా కొన్నిరోజుల క్రితం మేమంతా హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీ సందర్శించాం. పోటీలు పూర్తైన తర్వాత తప్పకుండా ఆ సినిమా చూడాలని నాకు నేనే ప్రామిస్ చేసుకున్నా. మళ్లీ నేను ఇక్కడికి వచ్చే నాటికి తప్పకుండా ఆ సినిమాపై రివ్యూ ఇస్తా'' అని ఆమె చెప్పారు. అనంతరం కిరీటాన్ని గెలుపొందడాన్ని ఉద్దేశిస్తూ.. ''ఇది నా జీవితంలో ఒక అద్భుతమైన రోజు. వ్యక్తిగతంగానే కాకుండా థాయ్‌లాండ్ ప్రజలకూ ఇదొక మైలు రాయి అనే చెప్పాలి. నేనెంతో గర్వపడుతున్నా. మిస్ వరల్డ్ స్టేజ్‌పై మా దేశానికి గుర్తింపు లభించింది. మా దేశానికి ఇదే తొలి విజయం. ఇలాంటి ఒక రోజు కోసం మేమంతా 70 ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. ఈ ప్రయాణం క్లిష్టమైనదని నేను చెప్పను. ఎందుకంటే, మన హృదయానికి చేరువైన దానిని పొందేందుకు వేసే ప్రతి అడుగుకు ఒక అర్థం ఉంటుంది'' అని ఆమె వివరించారు.



# హిట్ మూవీ సీక్వెల్.. ఆఫర్ నేనే వదులుకున్నా: ఇలియానా

**తాను కథానాయికగా చేసిన ఓ హిట్ మూవీ సీక్వెల్‌లో నటించే అవకాశం తొలుత తనకే వచ్చిందని నటి ఇలియానా చెప్పారు. కాకపోతే ఆ అవకాశాన్ని తానే స్వయంగా వదులుకున్నానని తెలిపారు.**

ఒకానొక సమయంలో దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుని అనంతరం బాలీవుడ్‌లో పలు సినిమాల్లో యాక్ట్ చేశారు నటి ఇలియానా. గత కొంతకాలంగా ఆమె సినిమాలకు దూరంగా ఉంటోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె ఇన్‌స్టా వేదికగా అభిమానులతో ముచ్చటించారు. నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. ఇందులో భాగంగా ఓ నెటిజన్.. ఆమె నటించిన ఓ హిట్ మూవీ సీక్వెల్ గురించి ప్రశ్నించాడు. దానిపై ఆమె స్పందించారు. సీక్వెల్‌లో నటించే అవకాశం తొలుత తనకే వచ్చిందని.. కాకపోతే తానే దానిని వదులుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు.

"మేడమ్.. 'రైడ్ 2' సినిమాలో మీరెందుకు నటించలేదు? మీ కమ్‌బ్యాక్ ఎప్పుడు ఉంటుంది?" అని నెటిజన్ అడగ్గా..

"సినిమాలను నేనెంతో మిస్ అవుతున్నా. నాక్కూడా ఆ సినిమాలో భాగం కావాలనిపించింది. 'రైడ్' నాకెంతో ప్రత్యేకమైన చిత్రం. మాలిని పాత్రలో మరోసారి ఒదిగిపోవాలనుకున్నా. మా దర్శకుడు రాజ్‌కుమార్ గుప్తా, నటుడు అజయ్ దేవ్‌గణ్‌తో కలిసి వర్క్ చేయాలని నాక్కూడా ఉంది. నిజం చెప్పాలంటే, సీక్వెల్ తెరకెక్కించాలనుకున్నప్పుడు టీమ్ నన్ను సంప్రదించింది. మళ్లీ యాక్ట్ చేయమని అడిగింది. కాకపోతే, అదే సమయంలో నాకు బాబు పుట్టాడు. దానివల్ల నా ప్రాధాన్యతలు మారిపోయాయి. 'రైడ్ 2' ప్రమోషన్స్‌లో వాణి కపూర్ ఎంతో యాక్టివ్‌గా పాల్గొన్నారు. ఈ పాత్రకు ఆమె కూడా ప్రత్యేకతను తీసుకువచ్చే ఉంటుందని నమ్ముతున్నా" అని ఇలియానా చెప్పారు. "భవిష్యత్తులో సినిమాల్లోకి వచ్చే అవకాశం ఉందా?" అని మరో నెటిజన్ ప్రశ్నించగా.. తప్పకుండా వస్తానని బదులిచ్చారు.

2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తితో ఇలియానా వివాహం జరిగింది. అదే ఏడాది ఒక బాబుకు ఆమె జన్మనిచ్చారు. "గర్భం ధరించాక పనిచేయాలనుకున్నా.. కానీ ఈ సమయంలో తలెత్తిన కొన్ని ఆరోగ్య సమస్యల కారణంగా ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చింది. ఈ ప్రతికూల పరిస్థితుల్లో మా అమ్మ, నా భర్త మైఖేల్ నాకు అండగా నిలిచారు. ఈ సమస్యల నుంచి బయటపడే ధైర్యాన్ని నాలో నింపారు" అని గతంలో ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. అజయ్ దేవ్‌గణ్ - ఇలియానా జంటగా నటించిన 'రైడ్' 2018లో విడుదలై విజయాన్ని అందుకుంది. దీనికి సీక్వెల్‌గా నిర్మించిన 'రైడ్ 2' మే ఆరంభంలో విడుదలైంది.

# నిశ్చితార్థ వార్తల వేళ.. అసలు విషయం చెప్పిన శ్రీలీల

**యువ నటి శ్రీలీల త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారంటూ వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. వీటిపై ఆమె క్లారిటీ ఇచ్చారు.**

**హైదరాబాద్:** యువ నటి శ్రీలీల త్వరలో పెళ్లి పీటలెక్కనున్నారంటూ వార్తలు వస్తున్నాయి. శుక్రవారం ఆమె కొన్ని ఫొటోలు షేర్ చేయగా.. అవి నిశ్చితార్థం ఫొటోలని పలువురు ప్రచారం చేశారు. వీటిపై ఆమె స్పష్టతనిచ్చారు.

తమ ఇంట్లో జరిగిన ఓ వేడుక గురించి శ్రీలీల వివరించారు. ''నా ప్రీ బర్త్‌డే వేడుకలను ఇంట్లోనే మేము ఈ విధంగా సెలబ్రేట్ చేసుకున్నాం. దీనికి సంబంధించిన ప్లానింగ్ అంతా మా అమ్మ చూసుకున్నారు'' అని ఆమె రాసుకొచ్చారు. ఈ వేడుకల్లో రానా సతీమణి మిహిక కూడా పాల్గొన్నారు. ఇందులో శ్రీలీల చీరకట్టులో కనిపించారు.

**అసలేం జరిగిందంటే..**

దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ సినిమాలు చేస్తూ కెరీర్‌లో దూసుకెళ్తున్నారు శ్రీలీల. సోషల్‌మీడియాలో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. శుక్రవారం సాయంత్రం ఆమె ఇన్‌స్టా స్టోరీస్‌లో కొన్ని ఫొటోలు షేర్ చేశారు. ఇందులో కుటుంబసభ్యులు ఆమెకు నలుగు పెడుతూ కనిపించారు. ఆయా ఫొటోలకు 'బిగ్ డే', 'కమింగ్ సూన్' అనే క్యాప్షన్ జత చేశారామె. వాటిని చూసిన నెటిజన్లు ఆమెకు నిశ్చితార్థం జరిగి ఉంటుందని కామెంట్లు పెట్టారు. ఈనేపథ్యంలోనే ఆయా కథనాలపై ఆమె తాజాగా స్పందించారు. జూన్ 14న ఆమె 24వ పుట్టినరోజు చేసుకోనున్నారు.



# పచ్చని ప్రకృతి నడుమ చిరునవ్వులు చిందిస్తోన్న బ్యూటిఫుల్ నటి.. హృదయానికి హత్తుకునే పిక్స్ వైరల్

సీతారామంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ బ్యూటీ.. హాయ్ నాన్న సినిమాతో మరింత క్రేజ్ సొంతం చేసుకుంది. టాలీవుడ్ హీరో నేచురల్ స్టార్ నాని అండ్ మృణాల్ ఠాకూర్ జోడిగా తెరకెక్కిన ఈ బ్లాక్ బస్టర్ చిత్రం ప్రేక్షకుల్ని విపరీతంగా ఆకట్టుకుంది. కళ్లలో నీళ్లు తెప్పించిందనడంలో అతిశయోక్తిలేదు. మృణాల్ ఠాకూర్ హైలెట్‌గా నిలిచిన ఈ సినిమా మంచి విజయాన్ని సాధించింది. ఈ సినిమాను నాని అండ్ మృణాల్ ఠాకూర్ ఇద్దరూ కలిసి ప్రమోట్ చేసిన విషయం తెలిసిందే. ఈ మూవీ తండ్రి, కూతురుల మధ్య బంధం.. ప్రేమ గురించి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంతో జనాలకు బాగా నచ్చింది. ఈ సినిమా తర్వాత మృణాల్‌కు టాలీవుడ్‌లో వరుస అవకాశాలు వచ్చాయి.

ప్రస్తుతం కూడా పలు సినిమాలతో ఫుల్ బిజీగా గడిపేస్తుంది. ఈ ముద్దుగుమ్మ నటించిన ఏ సినిమా అయిన బ్లాక్ బస్టర్ హిట్ కొట్టాల్సిందేనని సోషల్ మీడియాలో అభిమానులు తెగ హంగామా చేస్తుంటారు. అలాగే ఈ హీరోయిన్ తరచూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్‌తో టచ్‌లోనే ఉంటుంది. తరచూ ఏదో ఒక పోస్ట్‌తో నెటిజన్లను కవ్విస్తుంటుంది. తాజాగా మృణాల్ నెట్టింట ఓ పోస్ట పెట్టింది. పచ్చని ప్రకృతి నడుమ చిరునవ్వులు చిందిస్తోన్న బ్యూటిఫుల్ పిక్స్ పంచుకుంది. ఈ ఫొటోలు వీక్షించిన ఫ్యాన్స్ అద్భుతమైన కామెంట్లతో ముంచెత్తుతున్నారు. హృదయానికి హత్తుకునే పిక్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.



### అదే నా చివరి సినిమా.. ఆ పని చేస్తూ చచ్చిపోవాలనిపిస్తుందంటూ

# ఆమిర్ ఖాన్ షాకింగ్ కామెంట్స్ ..



బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ 'సితారే జమీన్ పర్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. RS ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ మూవీలో జెనిలియా హీరోయిన్‌గా నటిస్తోంది. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకోగా.. జూన్ 20న థియేటర్స్‌లోకి రాబోతుంది. ఈ నేపథ్యంలో.. ఆమిర్ ఖాన్ వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఆమిర్ ఖాన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. ''మహాభారతం చిత్రం అనేది నా చిన్నప్పటి కల. ప్రపంచంలో ఉన్న ప్రతి భావోద్వేగం, ప్రతి మానవ సంబంధం మహాభారతంలో కనిపిస్తుంది. నేను దాన్ని సినిమా రూపంలో తీసుకురావాలని కోరుకుంటున్నాను.

**బయటపెడుతుందంటూ డైరెక్టర్ భార్య సెన్సేషనల్ పోస్ట్**

అయితే ఈ మూవీ నా కెరీర్‌లో చివరి ప్రాజెక్ట్ కూడా కావొచ్చు. ఇలాంటి గొప్ప కథ తర్వాత నాకు ఇంకా ఏం చేయాలో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడుతుందని అనుకుంటున్నా. నాకు పని చేస్తూ చనిపోవాలని ఉంది. బహుశా ఇదే చివరి సినిమా అవుతుంది. దీన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నాం. ఇప్పటి వరకు అలాంటి చిత్రం రాలేదు. దాన్ని చూపించాలంటే చాలా టైమ్ పడుతుంది. ఈ జనరేషన్‌కు నచ్చేవిధంగా తీయాలనుకుంటున్నాము'' అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు షాక్ అవుతున్నారు.











## శ్రేయస్ కెప్టెన్సీ ఇన్నింగ్స్...

# ఐపీఎల్ ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్

**పంజాబ్ కింగ్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండో క్వాలిఫయర్‌లో ముంబయిపై పంజాబ్ విజయం సాధించింది.**

**ఈ కబురు:** పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. రెండో క్వాలిఫయర్‌లో ముంబయి ఇండియన్స్‌ను చిత్తు చేసిన పంజాబ్ టైటిల్ పోరుకు సిద్ధమైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 203/6 స్కోరు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనలో పంజాబ్ ఐదు వికెట్ల నష్టానికి 19 ఓవర్లలో 207 పరుగులు చేసి విజయం సాధించింది. పంజాబ్ సారథి శ్రేయస్ అయ్యర్ (87*) హాఫ్ సెంచరీ సాధించాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్‌తో తన జట్టును ఫైనల్‌కు చేర్చాడు. మంగళవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో పంజాబ్ టైటిల్ కోసం తలపడనుంది.

**శ్రేయస్ కెప్టెన్సీ ఇన్నింగ్స్...**
**ఐపీఎల్ 2025 ఫైనల్‌లో పంజాబ్ కింగ్స్**

ఐపీఎల్ 2025 సీజన్ ఫైనల్‌కు దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్ రెండో క్వాలిఫయర్ మ్యాచ్‌లో ముంబయిపై విజయం సాధించిన పంజాబ్ ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో మూడు సిక్స్‌లు కొట్టిన శ్రేయస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు ఎనిమిది పరుగులు ఇచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లో ఎనిమిది పరుగులు ఇచ్చిన బుమ్రా ప్రస్తుతం పంజాబ్ స్కోరు 181/5 చివరి రెండు ఓవర్లలో 23 పరుగులు అవసరం శశాంక్ సింగ్ ఔట్.. రనౌట్ చేసిన హార్దిక్ పాండ్య కీలక సమయంలో పంజాబ్‌కు షాక్ అనవసరమైన పరుగుకు ప్రయత్నించి శశాంక్ సింగ్ (2) రనౌట్ హార్దిక్ పాండ్య డైరెక్ట్ త్రో విసిరడంతో శశాంక్ ఔట్ ఈ ఓవర్‌లో 10 పరుగులు వచ్చాయి దీంతో పంజాబ్ స్కోరు 17 ఓవర్లకు 173/5

కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (57*) హాఫ్ సెంచరీ బాదేశాడు. నేహాల్ వధేరా ఔట్.. నాలుగో వికెట్ డౌన్ పంజాబ్ నాలుగో వికెట్‌ను కోల్పోయింది. నేహాల్ వధేరా (48) హాఫ్ సెంచరీ ముంగిట ఔట్, అశ్వని కుమార్ బౌలింగ్‌లో (15.4వ ఓవర్) షాట్‌కు యత్నించిన నేహాల్ ఎక్స్‌ట్రా కవర్‌లో శాంట్నర్ ఎలాంటి మిస్టేక్ చేయకుండా క్యాచ్ పట్టేశాడు ఈ ఓవర్‌లో రెండు సిక్స్‌లు రావడంతో 16 పరుగులు వచ్చాయి. ప్రస్తుతం పంజాబ్ స్కోరు 16 ఓవర్లకు 163/4 క్రీజ్‌లో శ్రేయస్ (48*), శశాంక్ (1*) కాస్త కట్టడి చేసిన బుమ్రా.. పంజాబ్ స్కోరు 147/3 (15) పంజాబ్ దూకుడును జస్‌ప్రీత్ బుమ్రా కాస్త కట్టడి చేశాడు. ఈ ఓవర్‌లో కేవలం ఐదే పరుగులు ఇచ్చిన బుమ్రా ప్రస్తుతం పంజాబ్ స్కోరు 147/3 (15) క్రీజ్‌లో నేహాల్ వధేరా (41*), శ్రేయస్ అయ్యర్ (41*)

**దూకుడు పెంచిన పంజాబ్ బ్యాటర్లు**

గత ఓవర్‌లో శ్రేయస్ (40*) అదరగొట్టగా.. ఈసారి నేహాల్ వధేరా (38*) వంతు ట్రెంట్ బౌల్ట్ వేసిన 14వ ఓవర్‌లో 14 పరుగులు రెండు బౌండరీలు బాదిన నేహాల్ వధేరా ప్రస్తుతం పంజాబ్ స్కోరు 142/3 చివరి ఆరు ఓవర్లకు పంజాబ్ గెలవడానికి 62 పరుగులు అవసరం శ్రేయస్ అయ్యర్ దూకుడు.. హ్యాట్రిక్ సిక్స్‌లు పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (37*) దూకుడు టోప్లీ బౌలింగ్‌లో హ్యాట్రిక్ సిక్స్‌లు బాదిన శ్రేయస్ ఈ ఓవర్‌లో 19 పరుగులు ఇచ్చిన టోప్లీ నేహాల్ వధేరా (27*)తో కలిసి నాలుగో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నిర్మించిన శ్రేయస్ ప్రస్తుతం పంజాబ్ స్కోరు 13 ఓవర్లకు 128/3 తన రెండో ఓవర్‌లో ఏడే పరుగులు ఇచ్చిన బుమ్రా తన తొలి ఓవర్‌లో 20 పరుగులు ఇచ్చిన బుమ్రా మళ్లీ బౌలింగ్‌కు వచ్చాడు. ఇన్నింగ్స్‌లో 12వ ఓవర్‌ను వేశాడు. ఈసారి కేవలం ఏడే పరుగులు ఇచ్చిన బుమ్రా

**పంజాబ్ స్కోరు 109/3**

క్రీజ్‌లో నేహాల్ వధేరా (26*), శ్రేయస్ (19*) నాలుగే పరుగులు ఇచ్చిన అశ్వని కుమార్ పంజాబ్ దూకుడుకు అశ్వని కుమార్ కళ్లెం ఇన్నింగ్స్ 11వ ఓవర్ వేసిన అశ్వని కుమార్ కేవలం నాలుగే పరుగులు ఇచ్చిన ముంబయి బౌలర్ ప్రస్తుతం పంజాబ్ స్కోరు 11 ఓవర్లకు 102/3 క్రీజ్‌లో శ్రేయస్ అయ్యర్ (18*), వధేరా (20*) చేతిలో పడిన క్యాచ్ మిస్.. నేహాల్‌కు లైఫ్ ముంబయి ఫీల్డర్ ట్రెంట్ బౌల్ట్ ఫీల్డింగ్ వైఫల్యం చేతిలో పడిన క్యాచ్‌ను వదిలేసిన బౌల్ట్ హార్దిక్ వేసిన పదో ఓవర్ చివరి బంతికి క్యాచ్ ఇచ్చిన నేహాల్ వధేరా (17*) వదిలేసిన ట్రెంట్ బౌల్ట్.. ఆ బంతి బౌండరీగా వెళ్లిపోయింది ఈ ఓవర్‌లో 17 పరుగులు ఇచ్చిన హార్దిక్ ప్రస్తుతం పంజాబ్ స్కోరు 10 ఓవర్లకు 98/3 స్ట్రాటజిక్ టైమ్‌ఔట్.. పంజాబ్ స్కోరు 81/3 (9) మిచెల్ శాంట్నర్ వేసిన 9వ ఓవర్‌లో 9 పరుగులు చివరి బంతికి నేహాల్ వధేరా (6*) ఫోర్ కొట్టాడు అయితే, బౌండరీ లైన్ వద్ద నమన్ ధిర్ కాస్త ముందుకు ఉన్నాడు లేకపోతే క్యాచ్ అందుకొనే అవకాశం ఉండేది ప్రస్తుతం పంజాబ్ స్కోరు 9 ఓవర్లకు 81/3 మూడో వికెట్ కోల్పోయిన పంజాబ్..

**ఇంగ్లిస్ ఔట్.. ముంబయికి ఊరట..**

పంజాబ్‌కు షాక్ ప్రమాదకరంగా మారుతోన్న జోష్ ఇంగ్లిస్ (38) ఔట్ హార్దిక్ వేసిన (7.5వ ఓవర్) షార్ట్‌పిచ్ బంతిని ఆడే క్రమంలో కీపర్‌కు క్యాచ్ తొలుత అంపైర్ ఔట్ ఇచ్చినప్పటికీ.. డీఆర్ఎస్ తీసుకున్న పంజాబ్ సమీక్షలోనూ ఔట్‌గా తేలడంతో పెవిలియన్‌కు ఇంగ్లిస్ దీంతో 72 పరుగుల వద్ద మూడో వికెట్‌ను కోల్పోయిన పంజాబ్ అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన నేహాల్ వధేరా ఈ ఓవర్‌లో కేవలం రెండే పరుగులు ఇచ్చిన హార్దిక్ ప్రస్తుతం పంజాబ్ స్కోరు 8 ఓవర్లకు 72/3

**బౌలింగ్‌కు శాంట్నర్..**
**ఆరే పరుగులు ఇచ్చిన స్పిన్నర్**

ముంబయి స్పిన్నర్‌ను రంగంలోకి దించింది మిచెల్ శాంట్నర్ ఏడో ఓవర్ వేశాడు కేవలం ఆరు పరుగులు ఇచ్చాడు ప్రస్తుతం పంజాబ్ స్కోరు 7 ఓవర్లకు 70/2 క్రీజ్‌లో ఇంగ్లిస్ (37*), శ్రేయస్ (7*)

**ముగిసిన పవర్ ప్లే.. పంజాబ్ స్కోరు 64/2 (6)**
**పంజాబ్ ఇన్నింగ్స్‌లో పవర్‌ప్లే ముగిసింది**

ఈ ఓవర్‌లో అశ్వని కుమార్ వికెట్ తీసి 9 పరుగులు ఇచ్చాడు జోష్ ఇంగ్లిస్ (33*) దూకుడుగా ఆడేయగా.. శ్రేయస్ అయ్యర్ (5*) బౌండరీతో పరుగుల ఖాతా తెరిచాడు ప్రస్తుతం పంజాబ్ స్కోరు 6 ఓవర్లకు 64/2 ఇంపాక్ట్ అశ్వని కుమార్‌కు వికెట్.. ప్రియాంశ్ ఔట్ ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన అశ్వని కుమార్ తాను సంధించిన తొలి బంతికే (5.1వ ఓవర్) వికెట్ తీసిన అశ్వని కుమార్ ప్రియాంశ్ ఆర్య (20) భారీ షాట్‌కు యత్నించి హార్దిక్ చేతికి క్యాచ్ ఇచ్చాడు దీంతో 55 పరుగుల వద్ద రెండో వికెట్‌ను కోల్పోయిన పంజాబ్ 20 పరుగులు ఇచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా ముంబయి బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో భారీగా పరుగులు జోష్ ఇంగ్లిస్ (29*) రెండు సిక్స్‌లు, రెండు ఫోర్లు బాదాడుబుమ్రా వేసిన ఐదో ఓవర్‌లో 20 పరుగులు వచ్చాయి



## వామ్మో.. ఆర్సీబీ టైటిల్ గెలిస్తే ఆయన్ని భరించలేం బాబోయ్!

ఆర్సీబీ జట్టు కోచ్ అండ్ మెంటార్‌గా వ్యవహరిస్తున్న సీనియర్ క్రికెటర్ దినేశ్ కార్తీక్ గురించి ఇంగ్లండ్ క్రికెటర్లు ఆసక్తికర కామెంట్స్ చేశారు.

ఐపీఎల్ క్వాలిఫయర్-1లో పంజాబ్ కింగ్స్‌ని చిత్తుగా ఓడించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఐపీఎల్ ప్రారంభం నుంచి అందని ద్రాక్షగా మిగిలిపోయిన టైటిల్‌ను ముద్దాడేందుకు ఒక్క అడుగు దూరంలో ఉంది. గత 17 ఏళ్లుగా మిగిలిపోయిన కలను నిజం చేసుకునేందుకు ఆతృతగా ఎదురు చూస్తోంది. ఈ నేపథ్యంలో ఆ జట్టుకు కోచ్ అండ్ మెంటార్‌గా వ్యవహరిస్తున్న దినేశ్ కార్తీక్ గురించి ఇంగ్లండ్ మాజీ క్రికెటర్లు ఆసక్తికర కామెంట్స్ చేశారు. ఒక వేళ ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంటే దినేశ్ కార్తీక్‌ను భరించలేమని ఓ స్పోర్ట్స్ న్యూస్ ఛానెల్ ఏర్పాటు చేసిన పాడ్ కాస్ట్‌లో నాసిర్ హుస్సేన్, మైకేల్ అథర్టన్ సరదాగా వ్యాఖ్యానించారు. ఐపీఎల్ ట్రోఫీ ఎదుట జాన్ టెర్రీలా ఫొటోకు పోజులిస్తాడని చెప్పుకొచ్చారు. గతంలో దినేశ్ కార్తీక్ ఆర్సీబీ తరపున ఆడాడు. తాజా సీజన్‌లో మెంటార్‌గా వ్యవహరిస్తున్నాడు. జట్టు సాధకబాధకాలను దగ్గరి నుంచి చూసిన అతడు.. అందర్నీ ఏకతాటి మీదకు తీసుకొచ్చి జట్టుకు దిశానిర్దేశం చేశాడు. కేవలం డ్రెస్సింగ్ రూమ్‌లోనే కాకుండా బౌండరీ బయట నిల్చొని ఎప్పటికప్పుడు ఆటగాళ్లకు సలహాలు సూచనలు ఇచ్చాడు. లీగ్ దశ ప్రారంభంలో కొంత సతమతమైన ఆర్సీబీ.. ఫైనల్‌కు చేరుకుందంటే అందులో కచ్చితంగా దినేశ్ కార్తీక్ కష్టం దాగి ఉందని చెప్పక తప్పదు.

"ఆర్సీబీలో భాగమవ్వడం ఓ ప్రత్యేకమైన అనుభూతి. ఈ జట్టుకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ అలాంటిది. ఐపీఎల్ మొదలైనప్పటి నుంచి ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నాం. మూడు సార్లు ఫైనల్‌కు వెళ్లినా బెంగళూరు కప్పును ముద్దాడలేకపోయింది. ఆ జట్టు ఆటగాడిగా నన్ను కూడా ఆ బాధ వెంటాడుతోంది. ట్రోఫీని కోల్పోతున్నప్పుడు కలిగే ఆ ఆవేదన ఎలా ఉంటుందో ప్రత్యక్షంగా అనుభవించాను. బెంగళూరు కోచ్ రూపంలో నాకు మరో అవకాశం వచ్చింది" అంటూ ఇటీవల మీడియాతో మాట్లాడుతూ దినేశ్ మనోగతాన్ని వెల్లడించాడు. క్వాలిఫయర్ -2లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా.. పంజాబ్, ముంబయి తలపడనున్నాయి. ఇందులో విజేతగా నిలిచిన జట్టు ఫైనల్‌కు వెళ్తుంది. ఆ టీమ్‌తో మంగళవారం ఆర్సీబీ తలపడుతుంది. 17 ఏళ్ల నాటి ఆర్సీబీ కల ఈ సారైనా నెరవేరుతుందో లేదో చూడాలి.



## ఎలిమినేటర్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దైతే..?

**చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా మరికొన్ని గంటల్లో గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో తలపడనున్నాయి.**

ఐపీఎల్ 2025 సీజన్‌లో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా మరికొన్ని గంటల్లో గుజరాత్ టైటాన్స్ , ముంబయి ఇండియన్స్ తలపడనున్నాయి. ఇది ఎలిమినేటర్ మ్యాచ్. ఈ పోరులో ఓడిపోయినవారు ఇంటిముఖం పట్టాల్సిందే. గెలిచిన జట్టు, క్వాలిఫయర్ 1లో ఓడిన పంజాబ్ కింగ్స్‌తో క్వాలిఫయర్ 2లో తలపడాల్సి ఉంటుంది. గురువారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్‌ను మట్టికరిపించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు అన్ని జట్ల కంటే ముందుగానే తన ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. నిన్నమొన్నటి వరకు పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉన్న గుజరాత్ టైటాన్స్ వరుసగా రెండు ఓటములతో మూడోస్థానానికి పరిమితమైంది. ముంబయి ఇండియన్స్ జట్టు కూడా తన చివరి మూడు మ్యాచుల్లో రెండింట్లో ఓడి నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఒకవేళ వర్షం కారణంగా గుజరాత్, ముంబయి మధ్య జరగాల్సిన కీలకమైన ఎలిమినేటర్ మ్యాచ్ రద్దైతే పరిస్థితి ఏంటి? ఏ జట్టుకు లాభం.. అని క్రీడాభిమానులు చర్చించుకుంటున్నారు.

**పెద్దగా ముప్పైతే లేదు!**

వాతావరణ శాఖ నివేదిక ప్రకారం మ్యాచ్‌కు వానముప్పు అంతగా లేదు. వర్షం పడే అవకాశం చాలా తక్కువగా ఉంది. ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా 37 డిగ్రీలు, కనిష్ఠంగా 25 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య క్వాలిఫయర్ 1 మ్యాచ్ సైతం గురువారం ముల్లాన్‌పూర్ వేదికగానే జరిగింది. ఈ పోరుకు వర్షం వల్ల అయితే ఏ అంతరాయమూ కలగలేదు. శుక్రవారం జరగనున్న మ్యాచ్‌కు కూడా ఎటువంటి ఇబ్బందీ తలెత్తకపోవచ్చు.

**ఒకవేళ వర్షం పడి, ఆట సాగకుంటే..**

అయినా.. ఒకవేళ వర్షం పడి, ఆట ఆగిపోతే గ్రూప్ దశ తర్వాత పాయింట్ల పట్టికలో అత్యుత్తమ స్థానంలో నిలిచిన కారణంగా గుజరాత్ టైటాన్స్ క్వాలిఫయర్ 2కు అర్హత సాధిస్తుంది. పంజాబ్ కింగ్స్‌తో తలపడే అవకాశాన్ని సొంతం చేసుకుంటుంది. ముంబయి ఇండియన్స్ మాత్రం ఐపీఎల్ నుంచి నిష్క్రమిస్తుంది. అంటే మ్యాచ్ రద్దైతే మాత్రం ముంబయి ఇండియన్స్‌కే నష్టం అన్నమాట. మరో విషయం ఏంటంటే ఎలిమినేటర్ మ్యాచ్‌కు రిజర్వ్ డే లేదు. అంటే ఏదైనా కారణం వల్ల మ్యాచ్ రద్దైతే తిరిగి నిర్వహించే అవకాశం లేదు. కానీ వాస్తవానికి క్షేత్రస్థాయిలో మ్యాచ్ ఆగిపోయే పరిస్థితి లేనందున అభిమానులు గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ మధ్య హోరాహోరీ పోరును వీక్షించే అవకాశం ఉంది.






## ప్రపంచ రెండో ర్యాంకర్ నకమురాపై అర్జున్ గెలుపు

**స్టావెంజర్:** నార్వే చెస్ టోర్నమెంట్‌లో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ అద్భుత విజయం అందుకున్నాడు. ప్రపంచ రెండో ర్యాంకర్ హికారు నకమురా (అమెరికా)తో జరిగిన ఐదో రౌండ్ గేమ్‌లో అర్జున్ అర్మగెడాన్ టైబ్రేక్ గేమ్‌లో గెలుపొందాడు. వీరిద్దరి మధ్య జరిగిన క్లాసికల్ ఫార్మాట్ గేమ్ 76 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. దాంతో విజేతను నిర్ణయించేందుకు అర్మగెడాన్ గేమ్‌ను నిర్వహించారు. ఈ గేమ్‌లో అర్జున్ 48 ఎత్తుల్లో నకమురాపై విజయం సాధించాడు.

మరోవైపు ప్రపంచ చాంపియన్, భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ ఐదో రౌండ్ గేమ్‌లో 56 ఎత్తుల్లో వె యి (చైనా) చేతిలో ఓడిపోయాడు. ఇదే టోర్నీ మహిళల విభాగంలో భారత స్టార్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి చైనా గ్రాండ్‌మాస్టర్ లె టింగ్‌జీపై అర్మగెడాన్ టైబ్రేక్ గేమ్‌లో 38 ఎత్తుల్లో గెలిచింది. అంతకుముందు వీరిద్దరి మధ్య క్లాసికల్ ఫార్మాట్ గేమ్ 31 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిసింది. భారత మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి 35 ఎత్తుల్లో స్పెయిన్‌కు చెందిన సారా ఖాడెమ్‌ను ఓడించింది.

## పియాస్ట్రి ప్రతాపం

**స్పానిష్ గ్రాండ్‌ప్రిలో విజేతగా నిలిచిన మెక్‌లారెన్ డ్రైవర్**



**బార్సిలోనా (స్పెయిన్):** క్వాలిఫయింగ్ సెషన్‌లో కనబరిచిన దూకుడును ప్రధాన రేసులోనూ కొనసాగిస్తూ... మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో ఐదో విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం జరిగిన స్పానిష్ గ్రాండ్‌ప్రిలో పియాస్ట్రి విజేతగా అవతరించాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన పియాస్ట్రి ఆద్యంతం ఆధిపత్యం చలాయించాడు. నిర్ణీత 66 ల్యాప్‌లను అందరికంటే వేగంగా, అందరికంటే ముందుగా 1 గంట 32 నిమిషాల 57.375 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు.

ఈ సీజన్‌లో పియాస్ట్రి చైనా గ్రాండ్‌ప్రి, బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి, సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి, మయామి గ్రాండ్‌ప్రిలలో విజేతగా నిలిచాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానాన్ని పొందగా... ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లెక్‌లెర్క్ మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఐదో స్థానంలో నిలిచినా... చివరి ల్యాప్‌లో జార్జి రసెల్ కారును ఢీకొట్టినందుకు అతనిపై 10 సెకన్ల పెనాల్టీని విధించారు. దాంతో వెర్‌స్టాపెన్ చివరకు పదో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

మరోవైపు ఆస్టన్ మార్టిన్ జట్టు డ్రైవర్ లాన్స్ స్ట్రోల్ చేతిలో నొప్పి కారణంగా రేసులో పాల్గొనలేదు. మెర్సిడెస్ డ్రైవర్ కిమి ఆంటోనెలి 53వ ల్యాప్‌లో, అలెగ్జాండర్ ఆల్బోన్ (విలియమ్స్) 27వ ల్యాప్‌లో వైదొలిగారు. 24 రేసుల ఈ సీజన్‌లో 9 రేసులు ముగిశాయి. 186 పాయింట్లతో పియాస్ట్రి అగ్రస్థానంలో కొనసాగుతుండగా... 176 పాయింట్లతో నోరిస్ రెండో స్థానంలో, 137 పాయింట్లతో వెర్‌స్టాపెన్ మూడో స్థానంలో ఉన్నారు. సీజన్‌లోని తదుపరి రేసు కెనడియన్ గ్రాండ్‌ప్రి జూన్ 15న మాంట్రియల్‌లో జరుగుతుంది.